క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



జడ్జితో బార్ అసోసియేషన్ సభ్యులు

షాద్‌నగర్: షాద్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ శశిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు జడ్జిని కలిశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్ యాదవ్, విజయ భాస్కర్‌గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కొందుర్గు: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీఆర్డీఏ ఫైనాన్స్ విభాగం డీపీఎం నిర్మల సూచించారు. బుధవారం కొందుర్గు మండల మహిళా సమాఖ్యకు సంబంధించిన మహిళా సంఘం సభ్యులు, సిబ్బందితో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, నిజాయితీ గల నాయకుడిని ఎన్నుకునే హక్కు ప్రజాస్వామ్య దేశమైన మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని అభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు స్కూల్ విద్యార్థుల యూనిఫాం కుట్టడానికి మహిళా సంఘాల ద్వారా 21 మంది టైలర్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపీఎం జయ, డీఎంజీ గిరి, సీసీ లక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షుడు సంగీత, కోశాధికారి అపర్ణ, సత్యమ్మతో పాటు వివిధ గ్రామాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సన్మానం



శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ బార్ కౌన్సిల్ మహిళా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది సిందం జయమ్మశంకరయ్య, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. బుధవారం మదాసి మదారి కురువ సంఘం అధ్యక్షుడు సిందం విఠలయ్య ఆధ్వర్యంలో బార్ కౌన్సిల్ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మదాసి మదారి కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాములు, బాల్‌రాజు, శ్రీనివాసులు, బండ వెంకటేశ్, నర్సింలు, బీరప్ప, రాజు, బండకుమార్, లక్ష్మయ్య, నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజలో ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామంలో బుధవారం మల్లన్న, బీరప్ప, పోచమ్మ ఆలయాల నిర్మాణాలకు కొండకల్ మాజీ సర్పంచ్ గౌరిగ వీరయ్య, ఎంపీటీసీ గుత్తి తాండ్రయ్యలు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని చెప్పారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, కాశీనాథ్, నాయక్, అశోక్, గుత్తి, బాబు, వెంకన్న, మైపాల్, రాంచంద్రయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

మొయినా'బాధ'



రెవెన్యూ లేని మొయినాబాద్ గ్రామ పంచాయతీ

- నాలుగు రెట్లు పెరిగిన జనాభా
- కాలనీలు విస్తరిస్తున్నా నిధుల లేమితో అరకొర సౌకర్యాలు

మొయినాబాద్: హైదరాబాద్ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ పేరు ప్రస్తుతం బాగానే మార్మోగుతోంది. కానీ మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిస్థితి ఇప్పటికీ చిత్ర విచిత్రంగానే ఉంది. మండల కేంద్రమైన మొయినాబాద్‌కు రెవెన్యూ లేదు. గత పదిహేనేళ్లలో మొయినాబాద్ గ్రామ పంచాయతీ వేగంగా విస్తరిస్తూ కొత్త కాలనీలు ఏర్పడుతున్నా ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు మాత్రం అరకొరగానే ఉండటంతో అభివృద్ధి కుంటుపడుతోంది. డంప్‌యార్డు లేక చెత్త సమస్యతో మొయినాబాద్ 'బాధ' వర్ణనాతీతం. ఇరవై తొమ్మిదేళ్ల క్రితం వరకు మొయినాబాద్, సురంగల్ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామం. 1995లో సురంగల్ గ్రామ పంచాయతీ నుంచి విడిపోయి మొయినాబాద్ ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. మొయినాబాద్ రెవెన్యూ గ్రామం కాకపోవడంతో సురంగల్ రెవెన్యూలోని కొన్ని సర్వే నెంబర్లను మొయినాబాద్‌కు కేటాయించారు. మండల కేంద్రమైన మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో సైతం సురంగల్, పెద్దమంగళారం, చిలుకూరు గ్రామ రెవెన్యూలు కలిసి ఉంటాయి.

విస్తరిస్తున్న కాలనీలు..

మొయినాబాద్ మండల కేంద్రం కావడంతో గత పదిహేనేళ్లుగా కొత్త కాలనీలు విస్తరిస్తున్నాయి. కానీ కాలనీలు విస్తరిస్తున్నంత వేగంగా మౌలిక సదుపాయాలు, అభివృద్ధి జరగడం లేదు. కొత్తగా ఏర్పడిన కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు లేవు. కొన్ని కాలనీల్లో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. దీనికి ప్రధాన కారణం నిధుల కొరత. 2011 జనాభా లెక్కల ప్రకారం మొయినాబాద్ గ్రామ పంచాయతీ జనాభా 2516 మంది మాత్రమే. కానీ ప్రస్తుతం జనాభా 10వేలు దాటింది. మొత్తం 1250 ఇళ్లు ఉన్నాయి. ఇటీవల కాలంలో కొత్తగా నిర్మించిన ఇళ్లు ఇంకా పంచాయతీ లెక్కలోకి రాలేదు.

ప్రభుత్వ గ్రాంట్లు అరకొరే...

జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు ప్రతి నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు వస్తాయి. అయితే 2021లో ప్రభుత్వం జనాభా లెక్కలు చేయకపోవడంతో ఇప్పటికీ మొయినాబాద్ పంచాయతీకి 2011 జనాభా లెక్కల ప్రకారం 2516 మంది జనాభా ఉన్నట్లుగానే ప్రస్తుతం ప్రభుత్వ గ్రాంట్లు వస్తున్నాయి. వాస్తవంగా ప్రస్తుతం మొయినాబాద్‌లో 10వేలకు పైగా జనాభా ఉంది. దీంతో ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులు ఏ మూలకు సరిపోవడం లేదు.

డంప్‌యార్డు లేక ఇబ్బందులు..

మొయినాబాద్ పంచాయతీలో ఉన్న 1250 ఇళ్లు, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న షాపులు, చికెన్ సెంటర్లు, హోటళ్ల నుంచి రోజుకు సుమారు 5 ట్రాక్టర్ల చెత్త వెలువడుతోంది. గ్రామ పంచాయతీకి డంప్‌యార్డు లేకపోవడంతో ఆ చెత్తంతా ప్రస్తుతం బైపాస్ రోడ్డుకు కేటాయించిన స్థలంలో డంప్ చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతంలో ఉన్న కాలనీల ప్రజలు, సురంగల్ రోడ్డుపై వెళ్తున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త డంపింగ్‌తో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. డంప్‌యార్డు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. కానీ ఇంతవరకు స్థలం కేటాయించలేదు.



బైపాస్ రోడ్డుకు కేటాయించిన స్థలంలో డంప్ చేసిన చెత్త

అభివృద్ధి పనులు చేయాలి



మొయినాబాద్‌లో కొత్త కాలనీలు చాలా ఏర్పడ్డాయి. జనాభా కూడా బాగా పెరిగింది. అన్ని కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు సరిగాలేవు. అధికారులను అడిగితే నిధులు లేవంటున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

-ఫెరోజ్, మొయినాబాద్

డంప్‌యార్డు ఏర్పాటు చేయాలి



మొయినాబాద్ గ్రామ పంచాయతీకి డంప్‌యార్డు లేకపోవడంతో రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో చెత్త డంప్ చేస్తున్నారు. దీంతో చుట్టుపక్క ఉన్న కాలనీల్లోకి ఈగలు, దోమలు వస్తున్నాయి. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డంప్‌యార్డుకు స్థలం కేటాయించాలని అధికారులకు విన్నవించాం. వెంటనే కొత్తగా స్థలం కేటాయించి డంప్‌యార్డు ఏర్పాటు చేయాలి.

-పద్మమ్మ, ఎంపీటీసీ, మొయినాబాద్

అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం



డంప్‌యార్డు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్థలం కేటాయించాలని విన్నవించాం. పెరిగిన కాలనీలు, జనాభాకు అనుగుణంగా నిధులు ఇవ్వాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

-సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి, మొయినాబాద్

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తుక్కుగూడలో నిర్వహించే జనగర్జన సభతో కాంగ్రెస్ ప్రచార జయభేరి మోగిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 6వ తేదీన తుక్కుగూడ వద్ద 10లక్షల మందితో భారీ జనగర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోను ప్రకటిస్తుందన్నారు. ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, షాద్‌నగర్ నుంచి సుమారు 15వేల మందితో సభకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, సుదర్శన్‌గౌడ్, కావలి శ్రీశైలం, నర్సింహ్మ, బస్వం, రాజేందర్‌రెడ్డి, అప్పి తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం పెంపొందించుకోవాలి

హైదరాబాద్ లయన్స్ క్లబ్ 320డీ డిస్ట్రిక్ గవర్నర్ డీజీవీ లక్ష్మి



డీజీవీ లక్ష్మిని సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మొయినాబాద్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం పెంపొందించుకోవాలని హైదరాబాద్ లయన్స్ క్లబ్ 320డీ డిస్ట్రిక్ గవర్నర్ డీజీవీ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో బుధవారం హైదరాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లియో–లీడర్‌షిప్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. సామాజిక అభివృద్ధిలో లయన్స్ క్లబ్ పాత్ర ఎంతో ఉందని, లయన్స్ క్లబ్ ద్వారా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, పర్యావరణం, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం వంటి అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంచుకోవడంతోపాటు సామాజిక సేవ, సమాజంపై అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు నాగరాజు, నర్సింహరాజు, సౌభాగ్యరామ్మోహన్, కార్తీక్‌రెడ్డి, ప్రవీణ్, రామ్‌ఫణిదర్, చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'త్వరలో బీఆర్‌ఎస్ కనుమరుగు'

మాడ్గుల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభావం కోల్పోయిందని లోక్‌సభ ఎన్నికల అనంతరం కనుమరుగుకాక తప్పదని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన నూతన వధువు మౌనిక వివాహానికి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం రూ.10వేలు కానుక అందజేశారు. గత సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సాయం అందజేశామన్నారు. ఇప్పటివరకు 82 మంది యువతుల వివాహాలకు సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిని శ్రీనివాస్, కొప్పుల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించడానికి ఏకమవుతాం

ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావుమాదిగ



నిరసన తెలుపుతున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా అవమానించిందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించడానికి మాదిగలమంతా ఏకమవుతామని ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగలు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ సీట్లలో రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు కేటాయించి అందులో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి మాలలకు భయపడి తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడానికి మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో ఐదు శాతం జనాభా కలిగిన రెడ్డి కులానికి ఆరు సీట్లును కేటాయించుకున్న రేవంత్‌రెడ్డి 12శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా ద్రోహం చేశాడన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నింటినీ భూస్థాపితం చేశామని, కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా పదిరోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బాత్యాల శశంకర్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, ఎం.శివప్రసాద్, బి.శ్రీనివాస్, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు వెంకటేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



హోమంలో పాల్గొన్న భక్తులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని రుద్రారం మాజీ సర్పంచ్ బండ స్వర్ణలతసతీశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బండ లావణ్యకృష్ణ దంపతులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో హనుమాన్ ఆలయంలో యజ్ఞహోమాలు, ఉద, స్థాపితా దేవతాపూజ హెవోస్నాపనం, సామూహిక హూరునామఫల, పుష్ప, ధాన్య, శయ్యాధివాసం, హారతీ, తీర్థ ప్రసాద వితరణ పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుర్రాల విషణవర్ధన్‌రెడ్డి, గుర్రాల శారదా సంజీవరెడ్డి, రమేశ్, మధు, గ్రామస్తులు తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 'నైతిక విలువలు, కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ, టెక్నాలజీ ప్రకారం పిల్లలు చేసే నేరాలు, సైబర్ నేరాలు, ఉన్నత లక్ష్యసాధన' తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని గొప్ప లక్ష్యంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను పరిమితికి మించి వాడటం తగదని, ఆన్‌లైన్ మోసాలను గుర్తించి అప్రమత్తతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీలత



మాట్లాడుతున్న కళాశాల సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏడు రోజులుగా ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం చిల్కమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమానికి డాక్టర్ శ్రీలత హాజరై మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. మా కళాశాల విద్యార్థినులు చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొని సహాయ సహకారాలను అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ.. గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో మా గ్రామాన్ని ఎంపిక చేసుకోవడం హర్షనీయమన్నారు. గ్రామంలో విద్యార్థినులు చేపట్టిన సేవా కార్యక్రమాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు శ్రీలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ అశోక్‌కుమార్ యాదవ్, గ్రామస్తులు సత్యనారాయణ, కృష్ణ, శ్రీను, రాజశేఖర్, ఆనంద్, నర్సింహ్మా పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం



చేవెళ్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్లలో..



షాబాద్‌లో..

చేవెళ్ల: తెలంగాణ సాయుధ పోరులో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన నాయకులతో పాటు కురుమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం, నిజాం పాలనకు వ్యతిరేకంగా రజాకార్లపై తిరుగుబాటు చేసిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అన్నారు. తెలంగాణ విముక్తి పోరాటంలో తొలిసమిదగా ఆయన మిగిలాడన్నారు. ఆయన త్యాగం ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. నాయన చూపించిన తెగువ ధైర్యం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మిరమణారెడ్డి, బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, కురుమ సంఘం నాయకులు సదానందం, వెంకటేశ్, టి.శ్రీను, రవి, శ్రీశైలం, మల్లేశ్, నర్సింలు, సత్యనారాయణ, శ్రీనివాస్, రాములు, దండు సత్తి, మహేశ్, వెంకటేశ్, వీరేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, రాములు, మల్లేశ్, శంకరయ్య, పెంటయ్యగౌడ్, పాండు, సాయినాథ్, పి.రాములు, బాలయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఆలూరు, పామెన, రామన్నగూడ, దామరగిద్ద, తదితర గ్రామాల్లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో ఉన్న కురుమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

షాబాద్: దొడ్డి కొమురయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని షాబాద్ కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరు పాండు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కురుమ సంఘం జెండాలను ఆవిష్కరించారు. అనంతరం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు మద్దూరు మల్లేశ్, సత్తయ్య, క్యామ నారాయణ, నరేందర్, రాపోల్ నర్సింహులు, కేసారం కృష్ణ, శంకరయ్య, సుదర్శన్, శేఖర్, వెంకటేష్, బీరప్ప తదితరులున్నారు.